కొంత ఎక్కువ.. ఎంతో తక్కువ..



- మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్
- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- విమానాశ్రయం, లెదర్ పార్కు ఏర్పాటు దిశగా అడుగులు
- జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ప్రకటనతో ప్రయోజనం
- చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లకు చేయూత
- ఆదాయం పన్ను పరిమితి పెంపుతో హర్షం
- కిసాన్ కార్డు రుణ పరిమితి పెంపుతో ఆనందం
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

మోదం

- మామునూరు విమానాశ్రయం
- లెదర్ పార్కు
- చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు
- కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి పెంపు
- ఆరు జిల్లాల్లో కేన్సర్ ఆస్పత్రుల ఏర్పాటు
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా

ఖేదం..

- కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన కరువు
- కొత్త రైల్వే మార్గాల ఊసే లేదు..
- సైనిక్ స్కూల్ మాటే లేదు..
- కానరాని గిరిజన విశ్వవిద్యాలయం
- మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేవు
- మేడారం జాతరకు జాతీయ హోదా లేదు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు

కేంద్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మోదం.. కొంత ఖేదం కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓరుగల్లు ప్రజలకు పెద్దగా వరాలను ఏమీ కురిపించలేదు. కొన్ని ప్రతిపాదిత పథకాలకు నిధులను కేటాయించి సంతోషపెట్టారు. అయితే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నప్రాజెక్టులను ప్రస్తావించలేదు. నిధులూ కేటాయించలేదు. రైల్వే పరంగా కొత్త లైన్లు, ప్రాజెక్టులు ప్రకటించలేదు. ఏళ్ల కల అయిన కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన లేదు. కోచ్ ఫ్యాక్టరీకి మాత్రం నిధులు ఇచ్చారు. ఇక మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల ఊసేలేదు. అలాగే మేడారం జాతరకు జాతీయ హోదా దక్కలేదు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ముచ్చటే లేదు. అయితే పేద, మధ్య తరగతి వర్గాలకు మాత్రం కేంద్రం వరాలను కురిపించింది. రైతులకు పెద్ద పీట వేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి చేయూతనిచ్చింది. ప్రధానంగా ఆదాయం పన్ను విషయంలో భారీ ఊరటను కల్పించింది. రూ.12లక్షల మేర ఆదాయం వరకు పన్నును మినహాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 లక్షల మంది మధ్యతరగతి వారికి లబ్ధి కలుగనున్నది. విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తామనే ప్రకటతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడనున్నాయి. చిన్న పరిశ్రమలకు రాయితీ ప్రకటనతో పరిశ్రమల ఏర్పాటుకు పూల బాట పడనుంది. అలాగే జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో ఆరు ఆస్పత్రులు నిర్మించనున్నారు. అసంఘటిత కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. హెల్త్ కార్డులు అందించి యేటా రూ.5లక్షల వరకు ఆరోగ్య సదుపాయం కల్పించింది. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలకు కొంత ఆశాజనకంగా ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి



వివరాలు : 8 లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రైస్ మిల్లర్లు విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. విద్యార్థులు, అధ్యాపకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వర్షాకాలంలో తరగతి గదులు కురుస్తున్నాయని తెలిపారు. 300 మంది విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని, అదనంగా నిర్మించాలని కోరారు. నాలుగు ల్యాబ్‌లు అవసరం ఉందని, స్కావెంజ ర్, స్వీపర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, జిల్లాకుమంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నోడల్ అధికారి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్ రెడ్డి, మధు, రాజేందర్, రంజిత్, విజయ్, రజినీకాంత్, కొమురయ్య, మహేందర్ పాల్గొన్నారు.

కోటా కోసం కొట్లాట!



ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరగనున్న బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం

నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్

- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- పార్టీలకు అతీతంగా ఏకమవుతున్న ప్రజాప్రతినిధులు
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కోసం డిమాండ్
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు, మహిళా రిజర్వేషన్లలో బీసీల వాటా ..
- బీసీ కోటా తేలాకే స్థానిక ఎన్నికలు పెట్టాలని డిమాండ్
- బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించిన నిర్వాహకులు

8

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెకర్ రాహుల్ శర్మ, ములుగు కలెక్టరేట్ నుంచి కలెకర్ దివాకర పాల్గొన్నారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయుల ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. ఫిబ్రవరి 3 నుంచి ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సక్రమంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్స్, గోడలపై రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని సూచించారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 10వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13వ తేదీలోపు ఉపసంహరణ ఉంటాయని వివరించారు.. 27న పోలింగ్ ఉంటుందని, మార్చి 3న ఫలితాలు వెల్లడవుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను తయారు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తులను ఫిబ్రవరి 7లోగా పరిష్కరించాలన్నారు. ప్రతి జిల్లాలో ఎంసీసీ టీంలను ఏర్పాటుచేసి కోడ్ ఉల్లంఘనలపై నిఘాపెట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందిని సరిపడా సంఖ్యలో నియమించాలన్నారు. పోలింగ్‌కు అవసరమయ్యే జంబో బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలన్నారు. వెయ్యి మంది కంటే తక్కువగా ఓటర్లు ఉన్న చోట కామన్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ర్యాలీలో డప్పు వాయిస్తున్న మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణకు ధర్మపోరాటం

- కాంగ్రెస్‌లో మాలల పెత్తనం
- నాకు ఏ పార్టీతోనూ సంబంధంలేదు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- జనగామలో భారీ ర్యాలీ.. సభ

జనగామ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యో తి): ఎస్సీ వర్గీకరణకు మాదిగలు ధర్మపోరాటం చేస్తుంటే, మాలలు అడ్డుకోవడానికి ప్ర యత్నిస్తున్నారని, కాంగ్రెస్‌లో మాలలదే పెత్తనమనిఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు... లక్ష డప్పుల దండోరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం జనగామలోని నెహ్రూ పార్కు నుంచి ఎన్ఎంఆర్ గార్డెన్ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మందకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు 31 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నట్టు పేర్కొన్నారు. తనకు ఏ పార్టీతో సంబంధం లేదని, ఎస్సీ వర్గీకరణ కోసం ప్రతీ ఒక్క పార్టీకి మద్దతు తెలపడం జరిగిందన్నారు.

పదవుల ఆశ చూపినా ఒప్పుకోలే..

బీసీ జాతీయ నాయకుడు ఆర్.కృష్ణయ్య బీసీల కోసం 30 ఏళ్ల ఉద్యమం చేసి పదవుల కోసం 4 పార్టీలు మారి పదవులను అనుభవించాడన్నారు. తనకు పదవులు ఇస్తామని ఆశపెట్టినా, వర్గీకరణే ముఖ్యమని ఏ పార్టీలో చేరలేదన్నారు. మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మద్దతు తెలిపిన పార్టీపై కూడా పోరాటం చేస్తామన్నారు.

వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలు..

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మొదటగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఎస్సీ వర్గీకరణ అమలులో చేస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అమలు చేయడంలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే వివేక్, వెంకటస్వామి, మల్లు భట్టివిక్రమార్క, ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ పార్టీలోని మాలల నాయకులు తమకున్న పలుకుబడితో వర్గీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వర్గీకరణపై సీఎం వైఖరి మారుతుందని ధ్వజమెత్తారు. అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధి స్తే రాబోయే తరాలకు భవిష్యతు ఉంటుందన్నారు. మహబూబ్ నగర్‌లో మాదిగలు ఎక్కువ ఉన్నారు కాబట్టే రేవంత్‌రెడ్డికి సీఎం పదవి వరించిందని, హామీలు మాదిగలకు ఇచ్చి మాలలకు ఉద్యోగాలు ఇస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 100కు 70 మంది మాదిగలు ఉన్నా, కాంగ్రెస్ మాదిగలకు రెండు ఎంపీ టికెట్లను ఇవ్వలేదని, మాలలను కాంగ్రెస్ పెంచి పోషిస్తోందని ఆరోపించారు. మాదిగలు చెప్పులు కుట్టే కుల వృత్తి అని సిగ్గు, భయం లేకుండా చెప్పుకోవాలన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమానికి మాదిగ లు, ఉపకులాలు ప్రతీఒక్కరు డప్పుతో వచ్చి మాదిగల గుండె చప్పుళ్లను ప్రభుత్వానికి వినిపిస్తామన్నారు. ఫిబ్రవరి 7 ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తుందన్నారు.

మాదిగ జాతికి సూర్యుడు మందకృష్ణ: పల్లా

మాదిగ జాతికి సూర్యుడు మందకిష్ణ మాదిగ అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏమతం, కులంలో పెట్టిన ప్రతి ఒక్కరు ప్రజల కోసం పని చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన పోరాటమని, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో శ్రమించిన మందకృష్ణకు పద్మశ్రీ చాలా చిన్నదాని, ఎస్సీ వర్గీకరణలో పద్మవిభూషణ్ రావాలన్నారు.

మాదిగలకు డప్పుల పంపిణీ

చిట్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి మాదిగలకు పుల్ల వంశస్థులు డప్పులు పంపిణీ చేశారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమం నేపథ్యంలో మండల కేంద్రంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పుల్ల సంజీవరావు, సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్, పుల్ల శ్రీనివాస్ చేతులమీదుగా శనివారం ఈ కార్యక్రమం జరిగింది. పుల్ల కొమురయ్య, కుమార్, శోభన్‌కుమార్, వర్షిత్, సతీష్‌కుమార్, మల్లయ్య, రవితేజ, శైలేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు భిక్షపతి, నేరెళ్ల ఓదెలు, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోల్కొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో డప్పులు పంపిణీ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సంజీవరావు, మిట్టపల్లి సురేందర్



బొమ్మాపూర్ క్వారీలో వివరాలు తెసుకుంటున్న టీజీఎండీసీ కమిషనర్ శశాంక

ఇసుక క్వారీలు తనిఖీ చేసిన టీజీఎండీసీ కమిషనర్

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇసుక క్వారీల్లో టీజీఎండీసీ కమిషనర్ శశాంక శనివారం ఆకస్మికంగా పర్యటించారు. టీజీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి క్వారీల్లో లోడింగ్ ప్రక్రియ, స్టాక్‌యార్డులు, వేబ్రిడ్జిలను తనిఖీ చేశారు లోడింగ్ ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్వారీ కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. క్వారీల్లో లోడింగ్ సాగుతున్న తీరును స్వయంగా పరిశీలించిన ఆయన లారీలో ఎంత మేరకు లోడ్ చేస్తున్నారో తూకం వేసి పరిశీలించారు. ఇప్పటి వరకు డంప్ చేసిన క్వాంటిటీతో పాటు అమ్మకమైన ఇసుక ఎంత? ఇంకా ఎంత మిగిలి ఉందో వివరాలు తెలుసుకున్నారు. లారీల్లో పరిమితికి మించి లోడింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని టీజీఎండీసీ సిబ్బంది, కాంట్రాక్టర్లకు హెచ్చరికలు జారీ చేశారు. లోడింగ్ చేసే ముందు వేబిల్లులు స్పష్టంగా పరిశీలించాలని సూచించారు. దీనికి ముందు స్టాక్‌యార్డు జియో కోఆర్డినేషన్స్‌ను పరిశీలించారు. వారి వెంట సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మైన్స్ ఏడీ జయరాజ్, తహసీల్దార్ ప్రహ్లాద్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్ ఉన్నారు.

జనవరిలో 66 శాతం బొగ్గు ఉత్పత్తి

కాకతీయఖని, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం భూపాలపల్లి ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాల్లో జనవరిలో 66శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 5,92,400 టన్నులు ఉండగా 3,88,558 టన్నుల ఉత్పత్తిని సాధించినట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో 4.55 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్టు తెలిపారు. ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. రక్షణ విషయంలో రాజీపడేది లేదని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతంఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ఈనెల 4న జరగాల్సిన ముస్టీ, 9న నిర్వహించాల్సిన శాంప్లింగ్ మజ్దూర్ పరీక్షలు వాయిదా పడ్డాయని జీఎం తెలిపారు.

కొంత ఎక్కువ ఎంతో తక్కువ

మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

హనుమకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025 కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆశించిన కేటాయింపులైతే లేవు. దీర్ఘకాలకంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ఊసే లేదు. కొత్త రైల్వే ప్రాజెక్టులు, మార్గాల ప్రస్తావన కానరాలేదు. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటన ఈసారి బడ్జెట్‌లో చోటుచేసుకోలేదు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం తన వంతుగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని వరంగల్‌వాసులు పడిన ఆశ నిరాశే అయింది. సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రస్తావన కూడా లేదు. ఎన్నో దశాబ్దాలుగా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కూడా ఈసారి బడ్జెట్‌లో కూడా హుళక్కే అయింది. ములుగులో ఏర్పాటవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా నిధులేవీ కేటాయించలేదు. మేడారానికి జాతీయ హోదా కల్పన ఈసారి కూడా కలగానే మిగిలింది. నగరంలో భూగర్భ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు ఇవ్వాలని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను పీఎం మిత్రలో చేర్చి రూ.300 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని, లెదర్‌పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కాజీపేట - భూపాలపల్లితో పాటు మూడు కొత్తరైల్వే లైన్లు, ప్రాజెక్టులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. జిల్లా ప్రజాప్రతినిధులు సైతం ఢిల్లీలో సంబంధిత శాఖల కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. వీటిలో వేటికీ బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

ఆదాయపు పన్ను శ్లాబు పరిమితి పెంపు

ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ప్రకటనకు ఎట్టకేలకు ఈ బడ్జెట్‌లో మోక్షం కలిగింది. ఆదాయ పన్ను శ్లాబు పరిమితిని పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తం అవుతున్నది. ఇకపై రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను ఉండదని స్పష్టం చేశారు. సవరించిన స్లాబ్‌ల ప్రకారం రూ. 4లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. బడ్జెట్‌లో సవరించిన స్లాబుల ప్రకారం మధ్య తరగతిపై పన్ను భారం గణనీయంగా తగ్గనున్నది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 18 లక్షల మంది మధ్య తరగతి వారికి లబ్ధి కలుగనున్నది.

కొన్నిటికి మోదం

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో కొంత మేరకు నిధుల కేటాయింపు జరిగినట్టు సమాచారం. అలాగే మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. లెదర్ ఉత్పత్తుల తయారీకి బడ్జెట్‌లో ప్రభుత్వం రాయితీలు ప్రకటించినందువల్ల ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న లెదర్ పార్కు జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశాలు కొంత మేరకు ఉన్నట్టు తెలుస్తోంది. బడ్జెట్‌లో వివిధ రంగాలకు ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇతరత్రా వాటి వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 10 లక్షల మంది ప్రజల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందే అవకాశం ఉన్నట్టు ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆదాయం పన్ను పరిమితి పెంపు వల్ల వరంగల్ జిల్లాలో సుమారు లక్షన్నర మందికి ప్రయోజనం కలుగనున్నది. మొత్తానికి బడ్జెట్ పట్ల అన్నివర్గాల ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది.

ఉమ్మడి జిల్లాల్లో క్యాన్సర్ కేంద్రాలు

ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ జిల్లాలో క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ 200 జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో రాబోయే రోజుల్లో క్యాన్సర్ ఆస్పత్రులు అందుబాటులో రానున్నాయి. ఈ యేడు వరంగల్ లేదా హనుమకొండ జిల్లాల్లో ఏదో ఒక దానిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటయ్యే అవకాశం ఉంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఉన్నప్పటికీ దాని ద్వారా క్యాన్సర్ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స అందడం లేదు. దీంతో వీరంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాకో కేన్సర్ కేంద్రం ఏర్పాటుతో క్యాన్సర్ రోగులకు ఊరట లభించినట్లవుతుంది.



రైతులకు చేయూత

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని పెంచడంతో రైతులకు ఆర్థికంగా చేయూత లభించినట్లయింది. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలిచ్చే కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం వల్ల ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల మంది రైతులకు ప్రయోజనం సమకూరనున్నది. 1998లో ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ స్కీమ్ కింద ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ కార్డురుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం చాలాకాలం సవరించలేదు. ఈ పథకం కింద రైతులు 9 శాతం వడ్డీ రేటుతో రుణాలు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం 2శాతం వడ్డీ రాయితీగా అందిస్తోంది. అదనంగా రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించినట్లయితే రైతులు మరో 3 శాతం వడ్డీ రాయితీని పొందుతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులు రూ.360 కోట్ల మేరకు రుణాలు తీసుకున్నారు. కార్డు రుణ పరిమితిని రూ. 5లక్షలకు పెంచడంవల్ల రైతులు మరింత రుణం తీసుకునే వెసులుబాటు లభించనున్నది.

చిన్న పరిశ్రమలకు ఊతం

బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్‌లకు ఊతం ఇస్తూ ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం లభించనున్నది. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేందుకు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉంది. స్టార్టప్‌లకు రూ.20కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ప్రకటించారు. అంకుర సంస్థలకు ప్రత్యేక క్రెడిట్ కార్డులు ఇస్తామని తెలిపారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహకంగా రూ.5లక్షల పరిమితి కలిగిన క్రెడిట్ కార్డుల ఇవ్వనున్నట్టు, 10 లక్షల మందికి ఈ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మైక్రోస్కేల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)లు 2,971 ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం జిల్లా పరిశ్రమ కేంద్రాల్లో 712 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

విమానాశ్రయానికి మార్గం

కేంద్ర బడ్జెట్‌లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు పెద్ద పీట వేశారు. పారిశ్రామిక, వ్యాపార, పర్యాటక రంగాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని దేశ వ్యాప్తంగా 150 విమానాశ్రయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది. ఇప్పటికే మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. అదనంగా అవసరమైన స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది.

గిగ్ వర్కర్లకు శుభవార్త

అసంఘటిత రంగాల ఉద్యోగులకు (గిగ్ వర్కర్లు) కేంద్రం శుభవార్త తెలిపింది. 2025 బడ్జెట్ ద్వారా వారికి గుర్తింపుతో పాటు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలోని 2.10 లక్షల మంది గిగ్ వర్కర్లకు మేలు కలుగనున్నది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్టు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల గిగ్ వర్కర్లకు గుర్తింపుకార్డులు లభిస్తాయి. అలాగే ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద ఉద్యోగికి, కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షల దాకా ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి రానున్నది. తాత్కాలికంగా తమకు ఉన్న వీలును బట్టి ఉద్యోగాలను చేసేవాళ్లను గిగ్ వర్కర్లు అంటారు. ప్రత్యేకించి యాప్‌ల ద్వారా సేవలందించే ఉద్యోగాల్లో ఎక్కువమంది ఉంటారు. డెలివరీ యాప్‌లు, రైడ్ యాప్‌లతో పని చేసే ఉద్యోగులతో పాటు ఫ్రీలాన్సర్లు, ఆన్‌లైన్ ట్యూటర్లు ఈ విభాగంలోకి వస్తారు. ఉమ్మడిజిల్లా ఈ తరహా ఉద్యోగులకు బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయంతో ఊరట కల్పించారు. ఈ ప్రోత్సాహకాల వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు లక్ష మంది గిగ్ వర్కర్లు మేలు జరగనున్నది.

వికసిత్ భారత్‌కు బాటలు

రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ వికసిత్ భారత్‌కు బాటలు వేయవచ్చు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ప్రధాని ఎల్ల వేళలా ముందుంటాడని అనడానికి ఈ బడ్జెట్‌తో నిరూపణ అయింది. ఉద్యోగులకు ఇన్‌కమ్ టాక్స్ పరిధి 12 లక్షలకు పెంచడం సంతోషకరమైన విషయం. స్వయం ఉపాధి పొందే యువతకు ఆవకాశాల్ని పెంచుతూ పరిశ్రమల స్థాపనకు రుణ పరిమితిని పెంచి చేయూతనిచ్చిన బడ్జెట్. ప్రాణాధర మందుల ధరలను తగ్గేలా నిర్ణయం తీసుకోవడం మోదీ ప్రభుత్వం మానవత దృక్పథానికి నిదర్శనం.

ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదు

కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులే కేటాయించారు. 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి 1,28,650 కోట్లు మాత్రమే కేటాయించారు. బడ్జెట్‌లో ఇది 2.53 శాతమే. గత బడ్జెట్ కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో 0.03 శాతం నిధులు తక్కువగానే కేటాయించారు. ఇంత తక్కువ కేటాయింపులతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతుంది. ప్రైవేటు విద్యా రంగానికి ఊతమిచ్చేదిగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 6 శాతం నిధులు కేటాయిస్తేనే విద్యా రంగాన్ని బలోపేతం చేయవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు ఏమీలేవు. బిహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, ప్రత్యేక నిధుల కేటాయింపులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలంగాణకు ఐఐఎం ఐజీటీ, సైనిక్ పాఠశాలలు, కేంద్ర విద్యాసంస్థలు రావాల్సి ఉండగా వాటిని పట్టించుకోలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ముందడుగు వేయడంలో అవసరమైన నిధులను కేటాయించలేదు. ఓట్లు, సీట్లకు బీజేపీ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింది.

ఇది సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్

తిప్పర్తి రాఘవరెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర బడ్జెట్ సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్. బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధి, మధ్య తరగతి ప్రజలకు పన్ను ఉపశమనం, వ్యాపార ప్రోత్సాహంపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రధాంగా రూ.12 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు, మూలధన వ్యయం పెంపు, ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్‌లకు మద్దతు, బీమా రంగంలో ఎఫ్‌డీఐ సంస్కరణలు ప్రధానంగా చెప్పుకోదగ్గవి. మధ్య తరగతి వేతన జీవులకు భారీ పన్ను ఉపశమనం కలిగించడం ముదావహం. అధిక మూలధన వ్యయం, దీర్ఘకాలిక ప్రోత్సాహం బడ్జెట్‌లో పాజిటివ్ అంశాలు. బడ్జెట్‌లో రైతులకు కొత్త పథకాలను ప్రవేశపెట్టడం, పీఎం ధన్ ధ్యాన్ కృషి యోజన ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరునున్నది. ఎంఎస్‌ఎంఈ, సహకార రంగాలకు రుణ సదుపాయాలను కల్పించడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది.

అలరించిన సినీ సంగీత యుగళ గాన విభావరి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ హనుమకొండ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సినీ సంగీత గాయకుడు సింగర్ చోటు 101 మంది గాయనీమణులతో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు దివంగత ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినిమా చిత్రాల్లో పాడిన పాటలు ఆద్యంతం అలరించాయి. కర్ణాటక సంగీత విద్వాంసులు ప్రొఫెసర్ వి.తిరుపతయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జూరీ మెంబర్, చీఫ్ కోఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్, విశ్వకర్మ (సాయిమీర కల్చరల్ సొసైటీ చైర్మన్), కర్నకంటి పోతనాచారి తదితరులు ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి గాన విభావరిని లాంఛనంగా ప్రారంభించారు. 101మంది గాయనీమణులతో ప్రధాన గాయకుడు చోటు సింగర్ 12గంటల పాటు నిర్విరామంగా సినీ సంగీత యుగళగాన విభావరిని నిర్వహించారు. కార్యక్రమంలో రావులకొలను రాంమూర్తి, రాపాక పులిగిళ్ల వెంకటపద్మావతి, మగ్దుం మొహియుద్దీన్ సహకారంతో విభావరిని బి. భువన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి గాయనీమణులు పాల్గొని తమ గానామృతాన్ని వినిపించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం గాయనీమణులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను నిర్వాహకులు ప్రదానం చేశారు.



సినీ యుగళ గీతాలను ఆలాపిస్తున్న గాయకుడు చోటు సింగర్

కోటా కోసం కొట్లాట!

- నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్
- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- బహిరంగ సభకు రానున్న జాతీయ నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బీసీ ఉద్యమానికి పోరాటాల గడ్డ ఓరుగల్లు వేదికవుతోంది. బీసీల హక్కుల కోసం రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రాబోతున్నారు. ఆదివారం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు జాతీయ బీసీ నేతలను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. బీసీలను సభకు భారీగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రిజర్వేషన్ల పెంపు


బీసీలకు రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ యుద్ధభేరి నిర్వహిస్తున్నారు. రిజర్వేషన్లలో తమ వాటా.. కోటా.. కోసమే యుద్ధభేరి మోగిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ డిమాండ్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న 27 శాతాన్ని పెంచుకుంటూ పోవాలని బీసీ యుద్ధభేరి ప్రధాన డిమాండ్‌గా ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో 6.8 శాతమే ఉన్న అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూ ఎస్ కోటా కింద ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ రద్దు చేయాలని మరో డిమాండ్‌ను తెరపైకి తీసుకు వస్తున్నారు. ఈడబ్ల్యుఎస్ కోటా వల్ల బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే వాదనను వినిపిస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలోనే బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలనే డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు. ఇప్పటికీ బీసీలపై చిన్నచూపు చూస్తున్నారని, కులం పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని బీసీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నారు. వీటితో పాటు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు వివిధ సంక్షేమ పథకాల కోసం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్నారు.

నేడు లక్ష మందితో బీసీ యుద్ధభేరి

పోరాటాల గడ్డ ఓరుగల్లు నుంచి మరో ఉద్యమం ప్రారంభమవుతోంది. రాజకీయాల్లో బీసీల హక్కులు, ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ యుద్ధభేరి సభను ఏర్పాటు చేశారు. లక్ష మందికి పైగా బీసీలను తరలించాలని ప్రణాళిక రూపొందించారు. వారం, పది రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీసీ యుద్ధభేరిని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలు

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే సదస్సుకు పొలిటికల్ జేఏసీ కన్వీనర్ సుందరాజ్ యాదవ్ నేతృత్వం వహిస్తుండగా, బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె, ఎంపీ మీసా భారతి, బీసీ ఉద్యమ నేతల బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్, డీఎంకే ఎంపీ విల్సన్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్రయాదవ్ తదితరులను ఈ సభకు రప్పిస్తున్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బస్వరాజు సారయ్య, బీఆర్ ఎస్ నేత, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యలతో పాటు మరికొంత మంది బీసీ నేతలను సభకు ఆహ్వా నిస్తున్నారు. తెలంగాణలో జరుగుతున్న బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించటం ద్వారా జాతీయ మీడియా దృష్టికి బీసీ ఉద్యమాన్ని తీసుకెళ్లే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.


సభకు ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, విప్ ఐలయ్య

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

పెళ్లి ప్రోత్సాహకం ఏదీ..?



కులాంతర వివాహాల జంటలకు అందని సాయం

వెంకటాపూర్, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): కులరహిత సమాజాన్ని నిర్మించి అంతరాలను చెరిపివేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు కొన్నేళ్లుగా నగదు అందిస్తోంది. అయితే... జంటలో ఒకరు ఎస్సీ అయి ఉండాలనేది నిబంధన కాగా, ప్రస్తుతం సమాజంలో పలువురు తల్లిదండ్రులు ఇలాంటి వివాహాలకు అడ్డుచెప్పడం లేదు. అభిరుచులు, అభిప్రాయాలు కలిస్తే పెద్దలను ఒప్పించి కులాంతర వివాహాలు చేసుకుంటున్నారు యువతీ యువకులు. పెద్దలు ఒప్పుకోకున్నా పోలీసులను ఆశ్రయించి ముందుకు సాగుతున్నారు. ఇదంతా బాగానే ఉన్నా కులాంతర వివాహం చేసుకున్న వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉండటంతో నిరాశకు లోనవుతున్నారు.

పైకం పెంచినా అందనే లేదు..

కులాంతర వివాహం చేసుకున్న జంటలను కొన్ని కుటుంబాలు మొదట్లో ఆదరించకపోయినా తర్వాత వారిని కుటుంబాలు దగ్గరకు తీస్తున్నాయి. మరికొన్ని జంటలను మాత్రం దూరంగా పెడుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారే అవకాశం ఉంటుంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కులాంతర వివాహం చేసుకున్న జంటలకు నగదు ప్రోత్సాహకంగా అందిస్తోంది. ఇది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల కన్నా తక్కువగా ఉండటంతో గత ప్రభుత్వం 2020 ఏడాది జూన్‌లో రూ. 50వేల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచింది. నగదు భారీగా పెరిగినా నగదు అందడం లేదు.

ప్రోత్సాహకాలు ఇలా..

వేర్వేరు కులానికి చెందిన యువతీ యువకులు వివాహం చేసుకుంటే ఆధారాలతో సహ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో దరకాస్తు చేసుకోవాలి. ఆధారాలకు అనుగుణంగా అధికారులు విచారణ చేపట్టి ప్రోత్సాహకానికి అర్హులుగా గుర్తిస్తే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. ఆపై ప్రభుత్వం జంటలకు ప్రోత్సాహక నిధులు మంజూరవుతాయి.

రూ. మెత్తం రూ. 1కోటి 35లక్షల పెండింగ్...

ములుగు జిల్లాలో 2021-22 ఏడాది నుంచి ఇప్పటి వరకు ఏడేళ్ల కాలంలో 74పైగా కులాంతర వివాహాలు జరిగినట్లు అంచనా. అయితే, లెక్కలోని రానివి ఇంకొన్ని ఉంటాయని భావిస్తున్నారు. కాగా, అధికారులకు అందిన దరఖాస్తుల ఆధారంగా మొత్తం 74 జంటలకు ప్రోత్సాహకం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇందులో 14 జంటలకు కులాంతర వివాహ ప్రోత్సాహవకం మంజూరు చేశారు. దీంతో ఇంకా 60 మంది జంటలు ఐదేళ్లుగా ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న సాయం వివరాలు

- 2021-22లో 7గురికి నగదు రూ.17.50 లక్షలు మంజూరయ్యాయి
- 2022-23లో 15 మందికి నగదు రూ.37.50 లక్షలు మంజూరు.
- 2023-24లో 9 మందికి నగదు రూ. 23.50 లక్షలు మంజూరు.
- 2024-25లో 4గురికి నగదు రూ. 7.50 లక్షలు మంజూరయ్యాయి.
- 2024-25లో మరో 10 మంది ఆన్‌లైన్‌లో ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్నారు.

మొత్తం జిల్లా వ్యాప్తంగా 74 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 34 మందికి మంజూరయ్యాయి. కానీ 14 మందికి మాత్రమే ప్రభుత్వం నుంచి రూ. 35 లక్షలు మంజూరయ్యాయి. ఇంకా 60 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రూ. కోటి, 50లక్షల నిధులు రావాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి సాయాన్ని విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

- లక్ష్మణ్ నాయక్, షెడ్యూల్డ్ కులాల జిల్లా అధికారి



కులాంతర వివాహం చేసుకున్న జంటలు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు ఇస్తే స్వీకరిస్తున్నాం. వీటిని పరిశీలించి సాయం మంజూరుపై సమాచారం కూడా చేరవేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పెండింగ్‌లో ఉన్న జంటల ఖాతాల్లో జమ చేస్తాం.

రామప్పను సందర్శించిన అడిషనల్ డీజీపీ



రామప్ప శిల్పకళాల సౌందర్యాన్ని కెమెరాలో బంధిస్తున్న అడిషనల్ డీజీపీ

వెంకటాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా శనివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ఆమె అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపద వీక్షించి మంత్రముగ్ధుల య్యారు. ఆలయ చరిత్ర గురించి గైడ్ ద్వారా తెలుసుకున్నారు. ఆమె వెంట ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాద్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, స్థానిక ఎస్సై జక్కుల సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా ఇటలీ, అర్జెంటీనా దేశాలకు చెందిన లోరెన్జో, డేవిడ్ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ములుగు పోలీసులకు పతకాల పంట



ఎస్పీ శబరీశ్‌తో పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు

ములుగు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన మూడో తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో ములుగు జిల్లా పోలీసులు 9 విభాగాల్లో 12 మంది పతకాలను సాధించారు. శనివారం ములుగులో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో పోలీస్ క్రీడాకారులు రెండు బంగారు పతకాలతోపాటు మూడు రజతం, నాలుగు కాంస్య పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. 400 మీటర్ల పరుగు పందెం(మహిళ) విభాగంలో సరస్వతి, అనూష, పూజలు బంగారు పతకాలు సాధించారని, రెజ్లింగ్ (గ్రీకోరోమన్) విభాగంలో ఆర్ఎస్సై రాకేష్ వెండి పతకం, బాస్కెట్‌బాల్ విభాగంలో హరీశ్ వెండి పతకం, బ్యాడ్మింటన్ (మిక్స్‌డ్ డబుల్స్) విభాగంలో అనిల్, అనూష వెండి పతకం, కరాటే విభాగంలో ఆర్ఐ సంతోష్ కాంస్య పతకం, రెజ్లింగ్(గ్రీకోరోమన్) విభాగంలో ఆర్ఎస్సై అశోక్ కాంస్య పతకం, బ్యాడ్మింటన్(సింగిల్స్) విభాగంలో పీసీ అనిల్ కాంస్య పతకం, రెజ్లింగ్(ఫ్రీస్టైల్) విభాగంలో ఏఆర్‌హెచ్‌సీ అమిత్ కుమార్‌సింగ్ కాంస్య పతకం, బాక్సింగ్ విభాగంలో పీసీ వినోద్ క్యాంస పతకం, జూడో విభాగంలో ఏఆర్‌హెచ్ఎస్ అమిత్ కుమార్‌సింగ్ కాంస్య పతకం, జూడో విభాగంలో నాగరాజు కాంస్య పతకం గెలుచుకున్నట్లు తెలిపారు.

విద్యార్థినులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

వెంకటాపూర్, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని వెంకటాపూర్ తహసీల్దార్ బాధ గిరి బాబు అన్నారు. మండలంలోని రామానుజపురం గ్రామపంచాయతీ పరిధిలోని చెంచుకాలనీ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా పాఠశాలను నిర్వహించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వాజేడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందిన వాసం నాగలక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ తరపున ఆర్థికసాయం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ శనివారం ఆమె దశదిన కర్మలకు హాజరై ఆమె భర్త వాసం నీలాద్రికి రూ. 10వేలు అందజేశారు. విక్రాంత్ వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాదబాబు రాజు, దాట్ల వాసు, నాయకులు తల్లడి ఆదినారా యణ, వత్సవాయి జగన్నాథరాజు, ఎస్.కె.ఖాజావలీ, చెన్నం స్వామి, అనుముల సంజీవరావు తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు

వాజేడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పైప్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఉన్న పైప్‌లైన్ స్థానంలో రోడ్డు విస్తరణకు అనుకూలంగా మారుస్తున్నారు. ఈ క్రమంలో పలు పంచాయతీలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్ పనులకు సంబంధిత కాంట్రాక్టరు శనివారం చేపట్టగా మిషన్ భగీరథ అధికారులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పాత పైపులను మరోక చోటకు మార్చి, పనిచేయని వాటి స్థానంలో కొత్తవి వేయనున్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఐటీడీఏ పీవో



హేమాచల క్షేత్రంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

మంగపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం ఆమె ఆలయానికి రాగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లక్ష్మీనరసింహస్వామితోపాటు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిని దర్శించుకున్న పీవో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవోను స్వామి వారి శేషవస్త్రాలతో అర్చకులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ముక్కమళ్ల రాజశేఖరశర్మ, అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, వెంకటనారాయణశర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆజంనగర్ రేంజ్‌ను తనిఖీ చేసిన డీఎఫ్‌వో

కాకతీయఖని, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని ఆజంనగర్ రేంజ్‌ను డీఎఫ్‌వో (విజిలెన్స్) రాజశేఖర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల అక్కడ అధికంగా పోడు జరుగుతోందని, అందుకు అటవీశాఖ అధికారులే సహకరిస్తున్నారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఆజంనగర్ డీఆర్‌వో ఉషను ఫోన్‌లో వివరణ కోరగా సమాధానం చెప్పలేదు.

స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయాలి: డీటీఎఫ్

చిట్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంచర్ల ఆరు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నైన్‌పాక ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా చల్లగరిగ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.శంకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా టి.సుధాకర్, విజయలక్ష్మి, చిరంజీవి, కార్యదర్శులుగా దేవేందర్, ప్రతాప్, సుమలత, రమేష్, జిల్లా కౌన్సిలర్లుగా తిరుపతిరెడ్డి, వెంకట్రాంనర్సయ్య, భిక్షపతి, వసంత, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సరళాదేవి, సభ్యులుగా జునేద్ నల్మా, ఎం.నవత, రాజు ఎన్నికయ్యారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల కమిటీ ఏర్పాటు



ఏఐటీయూసీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నూతన కమిటీ సభ్యులు

కాకతీయఖని, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియా సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ఏఐటీయూసీ అనుబంధంగా నూతన కమిటీని శనివారం ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక కొమురయ్య భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. బ్రాంచి ఇన్‌చార్జిగా చంద్రమౌళి, గౌరవ అధ్యక్షుడిగా రాంరెడ్డి, అధ్యక్షుడిగా కమలాకర్, ఉపాధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా సతీష్‌కుమార్, సలహాదారులుగా వేణు, సందీప్, కమిటీ సభ్యులుగా భరత్, రామ్మోహన్ , సంతోష్, వినోద్, రమేష్, శ్రీధర్, కొమురయ్య, రాజేందర్, రాజబాబును నియమించారు.

టీజీపీఈఏ జాయింట్ సెక్రటరీగా కిషన్



గణపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా రేణుకుంట్ల కిషన్ నియామకయ్యారు. ఈ మేరకు టీజీజెన్కో నుంచి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రత్నాకర్‌రావు నియామక పత్రం అందజేశారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

మహదేవపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులు క్షేత్ర సందర్శన చేసి మగ్గం పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బి.ప్రభాకర్‌రెడ్డి, బి.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఫీల్డ్ ట్రిప్ జరిగింది. టస్సర్ పట్టు కకూన్‌ల నుంచి రీలింగ్, కండెలు చేయడం, మగ్గంపై నేయడం, రంగులు అద్దడం, మార్కెట్‌కు సంబంధించిన అంశాలన్నింటినీ విద్యార్థులు స్వయంగా పరిశీలించి అవగాహన పెంచుకున్నారు

గ్రామీణుల చేరువలో కోర్టు సేవలు

- కేసుల వాయిదాలతో పౌరుల హక్కుకు భంగం
- హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద
- స్టేషన్ ఘన్‌పూర్‌లో కోర్టు సేవలు ప్రారంభం



కోర్టు హాల్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి నంద

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు చేరువలో కోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయమని హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద తెలిపారు. ఘన్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కం జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ కోర్టు ఏర్పాటుతో సమీప గ్రామాల ప్రజలకు న్యాయసేవలు త్వరితగతిన అందుతాయని తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ ప్రాంత ప్రజల, న్యాయవాదుల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. కోర్టు పరిధిలో మూడు వేల పెండింగ్ కేసులు ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కేసుల పరిష్కారం విషయంలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. బెయిల్ అనేది కేసుల విషయంలో తప్పనిసరి అంశమన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల సమన్వయంతో త్వరగా కేసులు పరిష్కరించే విధంగా చూస్తున్నామని తెలిపారు. కేసుల పరిష్కారంలో ఏఐ (కృత్రిమ మేధ)ని వినియోగించుకోవాలని న్యాయవాదులకు సూచించారు. కేసుల పరిష్కారం విషయంలో ఎక్కువ సమయం తీసుకోవద్దన్నారు. కేసులను పదే పదే వాయిదాలు వేసి ప్రజల ప్రాథమిక హక్కులకు ఇబ్బంది కలిగించొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా, జిల్లా జడ్జి రవీంద్రశర్మ, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్, సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, సందీప, ఫణీంద్ర భార్గవ, చంద్ర రుషి, బార్ అసోసియేషన్ ఘన్‌పూర్ అధ్యక్షుడు కనకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కాకతీయఖని, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. తెలుగింటి కోడలైన నిర్మలా సీతారామన్ ఇక్కడి ప్రజలపై ప్రేమ చూపలేదని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా రైల్వే ప్రాజెక్టులు, విభజ హామీలు, పాలమూరు, రంగారెడ్డి నీటి పారుదలకు జాతీయ హోదా, బయ్యారం కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందనే బీజేపీ వివక్ష చూపుతోందని ఆరోపించారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి

కాటారం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతి ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. పద్మశాలీల కులదైవమైన మార్కండేయ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ భక్తాంజనే యస్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పలువురికి పండ్లు పంపిణీ చేశారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దోమల సమ్మయ్య, నాయకులు పల్నాటి బలరాం, మాచర్ల రాజేందర్, యెలుగం సత్యనారాయణ, గాదె రమేష్, పులి అశోక్, కొండ వెంకటేశ్వర్లు, మాచర్ల రాజయ్య, సత్యనారాయణ, వెంకటేశ్, దోమల రాజశేఖర్, రమేష్, బత్తుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

- చిట్యాల (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కట్కూరి నరేందర్ పూలమాల వేశారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మండలంలోని చల్లగరిగలో పద్మశాలీ పరపతి సంఘం ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈగ కోటీశ్వర్, చింతకింది శ్రీనివాస్, సామల రాజేందర్, మార్కండేయ, సత్యనారాయణ, రమేష్, దశరథం, చంద్రమౌళి, విశ్వనాథం, మేరుగు సంపత్, సామల రాజేందర్, సమ్మయ్య, చందర్, నర్సయ్య పాల్గొన్నారు.
- కాకతీయఖని (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, డాక్టర్ ప్రధాన్, డాక్టర్ కవిత, పద్మశాలి సంఘం నాయకులు ప్రభాకర్, శ్రీధర్, రమేష్, సంపత్, వనం విజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.
- గణపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరులో భక్త మార్కండేయ జయంతి వేడుకలు పద్మశాలి సేవా సంఘం నాయకులు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు దుంప నర్సయ్య, మాజీ సర్పంచ్ కొత్త పద్మవెంకటేశ్వర్లు, సాంబమూర్తి దేవాలయం చైర్మన్ ప్రభాకర్, వర్తక సంఘం అధ్యక్షుడు పుట్టపాక కిరణ్, రమేష్, ప్రవీణ్, సుధాకర్, రాజు, మొగిలి, సంతోష్, రాజేందర్, వెంకటేశ్, మల్లికార్జున్, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు-వెయ్యి గొంతుల' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

టేకుమట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు-వెయ్యి గొంతుల కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి మాదిగ శనివారం ఆవిష్కరించారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని అమ్మ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు-వెయ్యి గొంతుల కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని కోరారు. కరపత్రాల కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రేణుకుంట్ల సంపత్, సారయ్య, రాజయ్య, శంకర్, బోయిని కిష్టయ్య, అంబాల సారయ్య, భద్రయ్య, మచ్చ సరోత్తం, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ఆటో చోరీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలో ఓ ఆటో చోరీకి గురైంది. పార్క్ చేసిన అరగంట వ్యవధిలోనే మాయమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని రాంపూర్‌కు చెందిన కాశిపాక విక్ర భూపాలపల్లి పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయం వద్ద జరిగిన వివాహ వేడుకకు వెళ్లాడు. భోజనం చేసి బయటికి వచ్చి చూసేసరికి బయట ఆటో కనిపించలేదన్నారు. దీంతో ఆ సమీపంలోని సీసీకెమెరాలను పరిశీలించగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆటోను తీసుకెళ్లినట్టు రికార్డు అయిందని తెలిపాడు. ఈ విషయం అతడు విలేకరులకు శనివరం తెలిపాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలి

కాటారం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రాబోయే వేసవికాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మండల పంచాయతీ అధికారి వీరస్వామి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మండలంలోని మేడిపల్లి, అంకుసాపూర్, బయ్యారం, మద్దులపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో ఎంపీవో వీరస్వామి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, మిషన్ భగీరథ అధి కారులు, సిబ్బందితో కలిసి తాగునీటి సరఫరా చేసే బోర్‌వెల్స్, చేతిపంపులు, ఓహెచ్ ఎస్ఆర్‌లు, పైప్‌లైన్లను శనివారం పరిశీలించారు. నీటి వనరులు, తాగునీటి సరఫరా తీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యదర్శులు సమస్యలుంటే అధికారుల దృష్టికి వెంటనే తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాయిగూడెం, ఏటూరు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వచ్చే 33కేవీ లైన్‌లో ఇన్సులేటర్ల మార్పిడి, మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో కరెంటు సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నన్ను కొట్టిన వారిపై చర్య తీసుకోండి

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసిన తోటి బైక్ మెకానిక్‌లపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన బైక్ మెకానిక్ కొండబత్తుల శంక ర్ కోరాడు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడాడు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భగా మెకానిక్ షాపులు మూసివేయాలని అసోసియేషన్ సభ్యులు వాట్సాప్ గ్రూపులో పేర్కొన్నారని తెలిపాడు. దీంతో తాను జెండా ఆవిష్కరణ తర్వాత షాపు ఓపెన్ చేస్తానని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని వాట్సాప్ గ్రూపు ద్వారానే అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లానన్నాడు. అయినప్పటికీ ఎవరూ స్పందించలేదని, ఈ క్రమంలో జెండా ఆవిష్కరణ తర్వాత షాపు తెరిచానని అన్నాడు. ఆ వెంటనే కొంత మంది మెకానిక్‌లు షాపు వద్దకు వచ్చి గొడవ చేసి తనను దూషించారన్నాడు. మర్నాడు ఈ విషయమై మాట్లాడుదామని అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు పిలిచి తొమ్మిది మంది విచక్షణ రహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ తర్వాత వారే పోలీస్‌స్టేషన్‌లో తనపై ఫిర్యాదు ఇచ్చారన్నాడు. తనపై దాడి విషయమై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కోరితే సీఐ తన ఫిర్యాదును తీసుకోలేదని, పైగా ఇద్దరు కానిస్టేబుళ్లు తనను పట్టుకోగా కర్రతో ఆయన చేతులపై, కాళ్లపై ఇష్టమొచ్చినట్టు కొట్టారని పేర్కొన్నాడు. మర్నాడు కడుపులో నొప్పి రావడంతో హనుమకొండలోని ఆస్పత్రిలో చూపించుకోగా రెండు పేగులకు వాపు వచ్చిందని, ఆపరేషన్ చేయాలని చెప్పగా ఆ వెంటనే ఆపరేషన్ చేయించుకున్నానని తెలిపాడు. అసోసియేషన్ బాధ్యులు విచక్షణ రహితంగా కడుపులో తన్నడం వల్లే తాను అస్వస్థతకు గురయ్యానని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా ఆవ్యక్తిని తాము కొట్టలేదన్నారు. గొడవపడి పరస్పరంగా ఫిర్యాదు ఇవ్వగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

కాటారం మండలంలో 30,278 మంది ఓటర్లు

కాటారం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 30,278 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. గత ఏడాది నవంబరు నెలలో ఓటర్ల తుది జాబితాలో 30,097 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల కమిషన్ నూతన ఓటర్ల నమోదు కోసం అవకాశం ఇవ్వగా 36 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 181 మంది ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు పొందారు. దీంతో మండల వ్యాప్తంగా 210 వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఒక కుటుంబానికి చెందిన సభ్యు లంతా ఒకే వార్డులో ఉండేలా వార్డుల వారీగా ఓటర్ల లెక్క సిద్ధమైంది. మండలంలో 15,594 మంది మహిళ ఓటర్లు, 14,675 మంది పురుష ఓటర్లు, 9 మంది ఇతరులు ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. కాటారం జీపీలో 14 వార్డులు ఉండగా అత్యధికంగా 6,338 మంది ఓటర్లు, నస్తూరుపల్లి జీపీలో అత్యల్పంగా 6వార్డుల్లో 338మంది ఓటర్లున్నారు. దామెరకుంట జీపీలో 10వార్డుల్లో 2,398, రేగులగూడెం 10వార్డుల్లో 2,015, గంగారం 10వార్డుల్లో 2,009, చింతకాని 10వార్డుల్లో 1,551, కొత్తపల్లి 10వార్డుల్లో 1,424, శంకరంపల్లి 10వార్డుల్లో 1387, చిద్నెపల్లి 10వార్డుల్లో 1,379, జాదరావుపేట 10వార్డుల్లో 1,243, ఇబ్రహీంపల్లి 10వార్డుల్లో 1,143, ధన్వాడ జీపీ 8 వార్డుల్లో 1,110, అంకుసాపూర్ 8వార్డుల్లో 1,038, ఒడిపిలవంచ 8వార్డుల్లో 880, విలాసాగర్ 8వార్డుల్లో 876, బయ్యారం 8వార్డుల్లో 852, గుమ్మాళ్లపల్లి 8వార్డుల్లో 695, ఆదివారంపేట 8వార్డుల్లో 688, ప్రతాపగిరి 8వార్డుల్లో 669, గుండ్రాత్‌పల్లి 8వార్డుల్లో 631, ధర్మసాగర్ 8 వార్డుల్లో 445, మేడిపల్లి 8వార్డుల్లో 426, వీరాపూర్ 6వార్డుల్లో 380, మద్దులపల్లి 6వార్డుల్లో 365 మంది ఓటర్లు ఉన్నారు. మద్దులపల్లి జీపీలో 8మంది, బయ్యారంజీపీలో ఒకరు ఇతర ఓటర్లు ఉన్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది.